వైభవంగా ఉగాది పర్వదినం

పొదలకూరు : పట్టణ ప్రజలు ఉగాది పర్వదినాన్ని వైభవంగా జరుపుకొన్నారు. నూతన తెలుగు సంవత్సరాది శోభకృత్‌కు ఆహ్వానం పలుకుతూ పట్టణంలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి ఆలయాలకు చేరుకుని నూతన సంవత్సరంలో సకల శుభాలు కలిగేలా చూడాలని వేడుకున్నారు. అనంతరం షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని సేవించారు.

- షిర్డీసాయిబాబా మందిరం, గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతామందిరంలో వేకువన మేలుకొలుపు, గీతాపారాయణం, కష్ణభగవానుడికి సహస్రనామార్చన, మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన, భజనలు నిర్వహించారు. ఉభయకర్తలుగా మిరియాల సురేంద్రబాబు,లలిత దంపతులు వ్యవహరించారు. గీతామందిరం కమిటీ కార్యదర్శి అనిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.
- పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం,అయ్యప్పనగర్‌లోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం వినిపించారు.
- పట్టణంలో కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు ప్రసాద్‌స్వామి ఉగాది పచ్చడిని భక్తులకు పంచిపెట్టారు.
- సేవాభారతి ఆధ్వర్యంలో పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఉదయం పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, అ ష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం పంచాంగ శ్రవణం వినిపించారు. 6 గంటలకు పల్లకిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ ఆదూరు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రాచపూటి రామలింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మనుబోలు: ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మనుబోలులోని మనుబోలమ్మ, నాగార్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. గంగమ్మ ఆలయం వద్ద భక్తులకు దుగ్గన వెంకటకృష్ణయ్య, రత్నమ్మ దంపతులు అన్నదానం చేశారు.

తోటపల్లిగూడూరు: తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వరిగొండలోని శ్రీ జ్వాలాముఖి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరీదేవి ఆలయం, నరుకూరులోని రాజరాజేశ్వరి ఆలయం, కాటేపల్లిలోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చిన పూజలు చేశారు. నూతన సంవత్సరంలో సకలశుభాలు కలిగేలా దీవించమని వేడుకున్నారు.


పొదలకూరు: విశేషాలంకరణలో శ్రీలక్ష్మీ,గోదా సమేత వెంకటేశ్వరస్వామి

కోవూరు: మండల ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. కోవూరు గ్రామదేవత నాగారప్పమ్మ దేవస్థానంలో అర్చకుడు సుబ్బరామయ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని నూతన సంవత్సరంలో సకలశుభాలు కలిగేలా దీవించాలని వేడుకున్నారు. ఉభయకర్తలుగా కోవూరు మంగళవీధి వారు వ్యవహరించారు. ఏఎం చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. పడుగుపాడులో గ్రామదేవత చింతాలమ్మ ఆలయంలో రామిరెడ్డి గజేంద్రరెడ్డి , మోడెం రాధాకృష్ణారెడ్డి, సుగుణమ్మ జ్ఞాపకార్థంగా అన్నదానం చేశారు. పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున రెడ్డి, మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొన్నారు. వేకువజామునే లేచి తలంటు స్నానాలు ఆచరించి కొత్తదుస్తులు ధరించి తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. షడ్రుచుల ఉగాది పచ్చడితో పాటు పిండి వంటలను ఆరగించారు. ఉగాది సందర్భంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పల్లిపాడులోని మీనాక్షీ సమేత రామేశ్వరవేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, రాత్రి పల్లకీసేవ వేడుకగా నిర్వహించారు.

బుచ్చిరెడ్డిపాళెం: మండల ప్రజలు ఉగాది పండగను ఘనంగా జరుపుకొన్నారు. జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు. ఉగాది సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి రావడంతో సందడి నెలకొంది. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం దంపతులు ప్రసాదాలను పంచిపెట్టారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

కొడవలూరు: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. తెలుగు వారికి అత్యంత ముఖ్యమైన పండగ కావడంతో ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఒకరికొకరు తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొంటూ ఆనందంగా గడిపారు. ఇంటిల్లపాది తెలుగు వారి సంప్రదాయంలో భాగమైన ఉగాది పచ్చడిని సేవించి తెలుగు సంస్కృతిని చాటి చెప్పారు. ఉగాది పర్వదినాన ప్రతీ ఒక్కరూ సంప్రదాయ దుస్తులు ధరించి కనిపించడంతో అన్నీ గ్రామాల్లో పండగ వాతావరణం కనిపించింది.


మనుబోలు: విశేషాలంకరణలో గంగమ్మ


పొదలకూరు: విశేషాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


పొదలకూరు: గీతామందిరంలో విశేషాలంకారంలో శ్రీకృష్ణుడు


బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో ప్రత్యేక పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ


కోవూరు: పడుగుపాడులోని చింతాలమ్మ ఆలయంలో అన్నదానం


మనుబోలు: గంగమ్మ ఆలయం వద్ద అన్నదానం

క్లుప్తంగా

విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



నెల్లూరు(సెంట్రల్): తైక్వాండో విజేతలకు సర్టిఫికెట్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత మదన్‌మోహన్‌రెడ్డి బుధవారం అందజేశారు. 29వ డివిజన్లోని కేశవనగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి, కృష్ణ, శివ, మల్లి, కరాటే మాస్టర్ నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మందుల అందజేత

నెల్లూరు(అర్బన్): నగరంలోని సాయిసేవా వృద్ధాశ్రమంలో వృద్ధులకు మందులు, తదితరాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. జేఎం మెడికల్స్ అధినేత సమీర్ సహకారంతో మందులను అందజేశామని ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు తెలిపారు. సభ్యులు వంశీ, శశికిరణ్, కార్తికేయ, గురుచరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి సత్కారం



నెల్లూరు(టౌన్): తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మహిళా ఉపాధ్యాయ సంఘ నేతలు బుధవారం సన్మానించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్నారా, సంఘ వ్యవస్థాపకురాలు పద్మజ, సుధారాణి, మాలి, తదితరులు పాల్గొన్నారు.

6న ఐక్య ప్రభురాత్రి భోజన ఆరాధన



నెల్లూరు(బృందావనం): బాప్టిస్ట్ చర్చి డౌనీ హాల్లో ఏప్రిల్ ఆరున నిర్వహించనున్న ప్రభురాత్రి భోజన ఆరాధనకు జిల్లాలోని సంఘకాపరులు, పెద్దలు, విశ్వాసులు హాజరై దైవాశీస్సులను పొందాలని ఆరాధన కమిటీ చైర్మన్ రెవరెండ్ డేవిడ్ దయాసాగర్ పేర్కొన్నారు. వీఆర్సీ సమీపంలోని డౌనీహాల్లో బుధవారం నిర్వహించిన సమాలోచన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఈఎం నేషనల్ సెక్రటరీ జెన్నీ క్రిస్టఫర్ వాక్య సందేశాన్ని ఇవ్వనున్నారన్నారు. బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్ సెక్రటరీ అరుణ్‌కుమార్, చైర్మన్ సురేంద్ర, రెవరెండ్లు సాల్మన్, భాస్కరయ్య, అబ్రహాం, కోటేశ్వరరావు, శ్రీధర్, హరిపాల్, సురేంద్రబాబు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంగమాంబ కల్యాణం



దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వెంగమాంబ అమ్మవారు-గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వెంగమాంబ దంపతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం



సంగం: దువ్వూరు జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న తాటికొండ మోహన్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా నెల్లూరు రోటరీ క్లబ్ సభ్యులు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోహన్‌ను పలువురు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కౌన్సిలర్లు సత్యనారాయణ, ప్రసాద్, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సన్మానం



పొదలకూరు : స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తున్న జంషీర్ చిన్నవయస్సులోనే హజ్‌యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని రావడంతో ముస్లిం మతపెద్దలు బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని టైలర్స్‌కాలనీ మస్జీద్-ఏ-అక్సాలో జరిగిన ఈ కార్యక్రమంలో మౌలానా ముస్తాక్‌మదనీ, మస్జీద్ ముతవల్లి మహబూబ్‌బాషా, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ షేక్ జిలానీ, చిన్నకరిముల్లా, వార్డు సభ్యుడు ఎస్‌కే అంజాద్, కో-ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, యస్దాని, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో జ్యోతిష్య విద్వాన్ నారాయణం ప్రసన్న రామకృష్ణాచార్యులు రూపొందించిన మినీ పంచాంగాన్ని బుధవారం ఆవిష్కరించారు. గొలగమూడి ఆలయ కమిటీ సభ్యులు, ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి చేతుల మీదుగా మినీ పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాంగ సంకలనకర్త రామకృష్ణాచార్యులు, జ్యోతిష్య శిరోమణి డాక్టర్ జీవీబీ మురళీకృష్ణను సత్కరించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు చందా వెంకటస్వామి, ఉమామహేశ్వరావు, పేరకం వేణుగోపాల్, పేర్ల సత్యం, చందా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

మనుబోలు: మోటార్‌సైకిల్ ఢీకొనడంతో వృద్ధుడు గాయాలపాలైన ఘటన మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. మనుబోలమ్మ ఆలయం వద్ద కావాడి అప్పలస్వామి బుట్టలు అల్లుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. తాను అల్లిన బుట్టలను విక్రయించేందుకు కేఆర్‌పురం సెంటర్‌కు నడిచి వెళుతున్నాడు. ఈ క్రమంలో అరుంధతీయవాడకు చెందిన కంటేపల్లి శ్రీనివాసులు మోటార్‌సైకిల్‌పై వేగంగా వస్తూ అప్పలస్వామిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అప్పలస్వామి కాలు విరగగా, 108 వాహనంలో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన అప్పలస్వామి

‘ఆసరా’తో ఆర్థిక భరోసా

కొడవలూరు: పొదుపు మహిళలకు ప్రభుత్వం ఆసరా పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని వైఎస్సార్‌క్రాంతి పథం సీసీ మమత పేర్కొన్నారు. మండలంలోని కమ్మపాళెంలోని సంఘబంధం సభ్యులకు బుధవారం ఆసరాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా 2019 ఏప్రిల్ వరకు బ్యాంకుల్లో ఉన్న బకాయిలను ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాలకు తిరిగి చెల్లిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే మండలంలోని పొదుపు సంఘాలకు రెండు విడతల్లో రూ.14 కోట్లు చెల్లించారని వివరించారు. మిగిలిన రూ.7 కోట్ల మొత్తాన్ని మరో రెండు విడతల్లో జమచేయనున్నారని తెలిపారు. ఈ నెల 25న మూడో విడత కింద మండలంలోని సంఘబంధాల సభ్యులకు రూ.4 కోట్ల మొత్తాన్ని చెల్లించనున్నారని వివరించారు. అందులో భాగంగా ఈ నెల 14 నుంచి ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఓఏ మస్తానమ్మ, సంఘబంధం అధ్యక్షురాలు విజయలక్ష్మి, సంఘ బంధం సభ్యులు పాల్గొన్నారు.


సంఘబంధం సభ్యులకు అవగాహన కల్పిస్తున్న సీసీ మమత

ఇరుకళల పరమేశ్వరికి సారె సమర్పణ

నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజలను నిర్వహించారు. అనంతరం ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి దేవస్థానం నుంచి ఉభయదేవేరులతో కలిసి సింహపురి క్షేత్రపాలకుడు రంగనాథస్వామి సారె సమర్పించారు. పేట ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. అనంతరం దేవస్థాన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, ప్రధానార్చకుడు జగన్నాథాచార్యులు, రవికుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఎస్పీ పూజలు

నెల్లూరు(క్రైమ్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారిని ఎస్పీ విజయరావు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్బీ, చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, సురేంద్రబాబు పాల్గొన్నారు.


రంగనాథస్వామి పేట ఉత్సవం


గొలగమూడిలో భక్తుల సందడి

వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉగాది పండగ సందర్భంగా వెంకయ్యస్వామిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు గొలగమూడికి చేరుకున్నారు. ఆశ్రమం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

జర్నలిస్టులకు నేటి నుంచి క్రికెట్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జర్నలిస్టులకు క్రికెట్ పోటీలను గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా అధ్యక్షుడు నందకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ చక్రధర్‌బాబు, నుడా చైర్మన్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముక్కా ల ద్వారకానాథ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. 12 జట్లతో నాకౌట్ పద్ధతిలో టోర్నీని నిర్వహించనున్నామని వివరించారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

నెల్లూరు రూరల్: న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి ఆవశ్యకతపై అవగాహన సదస్సును పొట్టేపాళెంలో బుధవారం నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి ముషీధర్, వీఆర్వో శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

అధికారి తీరుపై ప్రశ్నిస్తే ఫిర్యాదు చేస్తారా?

బుచ్చిరెడ్డిపాళెం: పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారి తీరుపై ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటని బుచ్చిరెడ్డిపాళెం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నాడెల్టా మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలో బుచ్చిరెడ్డిపాళెంలో ఓ పోలింగ్ బూత్‌లో ఎన్నికల అధికారిగా ఉన్న వ్యక్తి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి ఓ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను కోరడం జరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పోలింగ్‌బూత్ వద్దకు చేరుకుని ఎన్నికల అధికారి తీరుపై ప్రశ్నించడం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలో ఉంటే ఎన్నికల అధికారి ఇలా ప్రవర్తిస్తే మీరు అడగరాని ప్రశ్నించారు. పోలింగ్ సమయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలోని పోలింగ్ బూత్‌లోపలి వరకు వెళ్లాడని, దీనిపై ఎన్ని ఫిర్యాదులు చేయాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు తప్పుడు ఫిర్యాదులు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఎంపీపీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణాధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్ రెడ్డి, నాయకులు మోర్ల మురళి, మేనకూరు సీతారామిరెడ్డి, చీర్ల ప్రసాద్, మల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, వినోద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శరవేగంగా రైతుబజార్ నిర్మాణం

పొదలకూరు : పట్టణంలో రైతుబజార్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మార్కెటింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతుబజార్ నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. మంత్రి చొరవతో రెండో విడతగా రూ.18 లక్షలు నిధులు విడుదల కాగా పైకప్పు రేకులు, మరుగుదొడ్లు, ప్లాంట్‌ఫామ్‌లు, తదితర పనులు పూర్తి చేశారు. మూడో విడత నిధులు మంజూరైతే మిగిలిన పనులను వేగంగా పూర్తిచేసి ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం మార్కెటింగ్‌శాఖ అధికారులు అంచనాలు సిద్ధం చేస్తున్నారు.



వన్యప్రాణులను వేటాడితే చర్యలు


అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ఉదయగిరి: వన్యప్రాణులను ఎవరైనా వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్వో శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ వెంకటయ్య హెచ్చరించారు. ఉదయగిరి రేంజ్ పరిధిలో వన్యప్రాణులను వేటాడి మాంసం విక్రయాలు జరుపుతున్నారనే సమాచారంతో రేంజ్ అధికారి టీ ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అటవీ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి అటవీ సమీప గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరైనా వన్యప్రాణులను వేటాడినట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. వేసవి దృష్ట్యా అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి వస్తుంటాయని, వాటిని గమనించి సమాచారం ఇవ్వాలని కోరారు. అడవులకు నిప్పు పెడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, నాయబ్, లక్ష్మీప్రసన్న, ప్రసాద్, ఓంప్రకాష్, గౌతమ్, కరీముల్లా, రవికుమార్ పాల్గొన్నారు.